# సీతపీరు

మా కర్నూలు జిల్లాలో పీర్ల పండుగ చాలా గొప్పగా జరిగేది. దర్గాలన్నీ దర్జాగా వెలిగిపోయేవి.

ఉదయం బట్టలు కప్పడాలూ, మల్లెలూ, గంధాలూ అయిపోయేవి. చీకటి పడింతర్వాత గుండం తొక్కడం జరుగుతుంది.

పీర్లు మోస్తూ పూనకం వచ్చి తడిసిన ఒంటితో కణకణలాడే ఆ నిప్పుల మీద నడిచేవాళ్లని చూస్తూంటే ఒళ్లు జలదరించేది.

ఇప్పుడు నాస్తిక సంఘాల వాళ్లు నిప్పుల మీద నడవడం సాధ్యమేననీ దానికి శాస్త్రీయ కారణాలు చూపుతూ వాళ్లు నడిచి మరీ చూపుతున్నారు.

జ్ఞానసహితంగా చేస్తే అది శాస్త్రీయం.

అజ్ఞానంతో అదేపని చేస్తే మౌఢ్యం...

రోజు రోజుకీ అంతరించిపోవాల్సిందిపోయి, మరీ బలపడుతూన్న కులమత రాజకీయాలతో పీర్ల పండక్కి మా కర్నూల్లో గండం ఏర్పడింది. హిందూ - ముస్లింల గొడవల మూలంగా ప్రభుత్వ నిషేధానికి గురైంది.

మా చిన్నప్పుడు పీర్ల పండక్కి పగటిపూట వెళ్లనిచ్చినా రాత్రి మాత్రం ఇంటి దగ్గర కట్టిపడేసేవాళ్లు.

కానీ గుండం తొక్కడం మాత్రం రాత్రిళ్లే జరిగేది. మాకు గుండం తొక్కడం చూట్టమే కావాలి. ఓ పీర్ల పండక్కి సీతగాడు వాడి పరమ రొటీన్ ప్లానుతో ముందుకొచ్చాడు. 'అమద్సా (అహ్మద్‌సారు) ఇంట్లో చదుకొవొస్తామ'ని చెప్పడం ఆ ప్లాను... నిజానికి అహ్మద్ సారు ఇల్లు కూడా రాత్రైతే చాలు నిద్రపోతూన్న బడిలా ఉండేది. ఎక్కడెక్కడి పిల్లలో అక్కడిద్దరు, ఇక్కడ ముగ్గురు లోపలా బయటా కట్టలమీదా, ఈత చాపలపైనా పిల్లలే పిల్లలు.

సరే ప్లాను ప్రకారం ఏడింటికే నే రెడీ అయిపోయా. సీతగాడు జేబులో బెల్ల పుండలూ, రెండు జొన్నరొట్టెలు పేపర్లో చుట్టి చంకలో పెట్టుకుని వచ్చాడు.

ఇద్దరం నడుస్తూ నడుస్తూ పాత టౌన్ చేరుకున్నాం. సందులూ గొందుల్లో వాళ్లనీ వీళ్లనీ అడుగుతూ పెద్ద దర్గా చేరుకున్నాం. అక్కడ విపరీతమైన రద్దీ... యింకా గుండంలో కట్టెలు మండుతూనే ఉన్నాయి. పెద్ద పెద్ద దుంగలు తెచ్చి అందులో వేసారు, అవి కాలి

నిప్పులు కావాలంటే ఏ మధ్యరాత్రో అవుతుంది.

ఓ రెండు గంటల తర్వాత నా శక్తి హరించుకుపోయింది. నిద్రాదేవి ఆవహిస్తోంది. సీతగాడి పరిస్థితి అట్లాగే ఉంది.

జనాలకి కాస్త దూరంగా వెళ్లి ఓ అరుగుమీద కూచున్నాం. సీతగాడు తెచ్చిన రొట్టెలు బెల్లంతో తిన్నాం. తర్వాత కాళ్లు నిలబడ్డానిక్కూడా సహకరించడం మానేశాయి. ఇక ఇల్లెట్లా చేరాలి? భయం వేయడం మొదలైంది. "ఎట్లాగో అట్లా వెళిపోదాం రా సీతా" అన్నాను. "ఉండు చూసొస్తా తొక్కుతున్నారేమో" అని సీతగాడు గుంపులో కల్సిపోయాడు వెళ్లినవాడు ఎంతకూ రాడు.

దాదాపు అరగంటైంది. అరిచి నాగొంతు నాకే వినిపించని సందడి... ఇంతలో తొక్కిసలాట మొదలైంది. నాకు భయం రెట్టింపైంది. చిన్నగా దూరం దూరంగా జరిగి ఇంటిదారి పట్టా.

మా కర్నూలు పాత టౌను ఓ పద్మవ్యూహం... చిన్నచిన్న సందులు గొందులూ... దారి తప్పాను. ఏడుపొస్తోంది భయం వేస్తోంది. పైగా అర్భకుడిని, కాళ్లు పీకుతున్నాయి, నిద్దరొస్తోంది... అసహాయత...

ఇంతలో ఇద్దరు నిక్కరు కానిస్టేబుళ్లు వచ్చారు. వాళ్లన్చూసి యింకా ఠారెత్తిపోయింది. అయితే వాళ్లు నా పరిస్థితి గమనించినట్టున్నారు "ఇల్లెక్కడ?" అనడిగారు, చెప్పాను. వాళ్లిద్దరూ ఏదో మాట్లాడుకుని ఓ గడ్డం కానిస్టేబులు నన్ను తన సైకిలెక్కించుకుని పెద్దాసుపత్రి దగ్గర దింపి "ఇక్కడ్నించీ ఇంటికిపోతావా?" అనడిగాడు, ఆనందంగా తలూపి దొంగలా ఇల్లు చేరి ఇంటిబైట తడిక మంచం మీద చేరిపోయా... అంతే మళ్లీ ఉదయాన్నే అరుపులు ఏడుపులు విని లేచా... ఎదురుగా సీత వాళ్లమ్మ... అర్థమైంది సీత గాడింటికి రాలేదు. ఇక నాపనైపోయిందనుకుని భయపడ్తూనే నిజం చెప్పేసా...

ఇక గాబరాగాబరాగా మా రామ్మూర్తి బావ, సీతగాడి నాన్న సైకిలెక్కి బయల్దేరారు వాణ్ణి వెదకడం కోసం.

అంతలోనే ఓ ఫకీరు రిక్షాలో సీతగాడితో దిగాడు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత సీత చెప్పాడు. నేను వాణ్ణి వెతుకుతోంటే, వాడు నన్ను వెదుకుతూ తిరిగాడుట అలుపొచ్చి నిద్రొస్తే దర్గా వెనక్కెళ్లి నిద్రపోయాట్ట అదీ సంగతి.

* * *

***అప్పుడెప్పుడో బాల్యపు అమాయకత్వంతో కొద్దిసేపు కనబడకుండా పోయి అందర్నీ కలవరపరిచిన సీతగాడు... తర్వాతి రోజుల్లో అందిన చోటల్లా అప్పులు చేసి తీర్చలేక ఎవ్వరికీ కనబడకుండా వెళ్లిపోయాడు శాశ్వతంగా... ఎక్కడున్నాడో బతికుంటే చాలు... ఇప్పుడు ఎక్కడ పీరు కనిపించినా దాంట్లో సీతే కనిపిస్తాడు. ●***